హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 | కనిష్ఠం 23.4



జగత్కల్యాణ కారకుడు, భక్తజనబాంధవుడు, ఆర్తత్రాణపరాయణుడు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిబ్రహ్మోత్సవ తిరుకల్యాణ పర్వాలు సోమవారం రాత్రి వైభవంగా కొనసాగాయి. యాదగిరికొండపై ఉత్తర తిరుమాఢ వీధిలోని తాత్కాలిక బ్రహ్మోత్సవ కల్యాణ వేదికపై అంగరంగ వైభవంగా కల్యాణ తంతును అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, అరటి, మామిడి తోరణాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన కల్యాణ వేదికపై అర్చక బృందం వేద మంత్రోచ్ఛారణ, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల నడుమ లక్ష్మీనరసింహుల కల్యాణం కన్నుల పండువగా సాగింది.

- యాదగిరిగుట్ట

కల్యాణ వైభోగమే

యాదగిరికొండపై వైభవంగా లక్ష్మీనారసింహుడి తిరుకల్యాణం

ముక్కోటి దేవతలు ఆహూతులుగా, చతుర్ముఖ బ్రహ్మాది దేవతల సమక్షంలో దేవదేవుడు నృసింహుడు లోక కల్యాణార్థం సముద్రుడి తనయ మహాలక్ష్మీ అమ్మవారి మెడలో వేద పండితులు నిర్ణయించిన సుముహూర్త ఘడియ తులా లగ్నంలో మాంగల్యధారణ చేశారు. ముందుగా పట్టు వస్త్రాలు, స్వర్ణ, వజ్రవైఢూర్య, ముత్యాల ఆభరణాలతో నవ వరుడిగా అలంకృతుడైన లోక కల్యాణకారకుడు మృగనరుడు నారసింహుడు గజవాహనం అధిరోహించగా, భక్తజనకోటికి సకల సంపదలను ప్రసాదించే మహాలక్ష్మీ అమ్మవారిని పుష్పాల పల్లకిలో మంగళవాయిద్యాలు.. మేళతాళాలు.. భక్త జనుల జయ జయ ధ్వానాలు, రుత్వికుల వేదపారాయణాలు.. ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ ఆలయ తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తూ బ్రహ్మోత్సవ కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. స్వామివారి, అమ్మవారి ఉత్సవమూర్తులను బ్రహ్మోత్సవ కల్యాణమండపంపై ఎదురెదురుగా అధిష్ఠింపజేశారు. జగద్రక్షకుడు లక్ష్మీనృసింహుల కల్యాణ వేడుకలను శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో దేవతల సైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడికి తొలి పూజలతో శ్రీకారం చుట్టారు. నూతన కల్యాణమూర్తులు స్వామి, అమ్మవార్లకు అర్చకులు రక్షాసూత్రధారణ చేసి వేద ప్రాశస్త్యమైన మంత్రోచ్చరణతో నృసింహుడికి యజ్ఞోపవీత్రధారణ తంతు నిర్వహించారు. దేవదేవుడు నృసింహుడికి లక్ష్మీ అమ్మవారి తండ్రి సముద్రుడు పాద ప్రక్షాళన చేసిన అనంతరం కన్యాదానం చేశారు. బ్రహ్మోత్సవ కల్యాణంలో వధూవరులు నరసింహుడు, మహాలక్ష్మీ అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం అలంకరించే ఘట్టాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. అనంతరం 'మాంగల్యం తంతు నానేనా, లోకరక్షణ హేతునా' అనే అర్చకుల వేద మంత్రోచ్చరణ, భక్తజనుల గోవింద నామస్మరణ నడుమ అమ్మవారి మెడలో మాంగల్యధారణ కొనసాగింది. నూతన కల్యాణమూర్తులు లక్ష్మీనృసింహులను ముత్యాల తలంబ్రాలతో ఆచార్యులు కొలిచారు. కల్యాణ వేడుకల అనంతరం నూతన కల్యాణమూర్తులు స్వామి, అమ్మవార్లను పక్కపక్కన కూర్చుండబెట్టిన అర్చకులు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. లక్ష్మీనృసింహుల బ్రహ్మోత్సవ తిరుకల్యాణ పర్వాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం నిర్వహించగా, ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి భాస్కర్ రావు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి దేవదేవుడి బ్రహ్మోత్సవం March 11-21 8వ రోజు



శ్రీరాముడి అలంకారంలో దర్శనమిచ్చిన నృసింహుడు

కల్యాణోత్సవంలో ప్రముఖులు

యాదగిరీశుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన తిరుకల్యాణంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు పాల్గొన్నారు. వీరు స్వామివారి బ్రహ్మోత్సవ తిరుకల్యాణ టికెట్లు కొనుగోలు చేసి పాల్గొన్నారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా వీరికి దేవస్థాన అధికారులు, అర్చకుల నుంచి అధికారికంగా ఎలాంటి స్వాగతం లభించలేదు. వీరు సామాన్య భక్తుల మాదిరిగా కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు.

శ్రీరాముడిగా భక్తులకు దర్శనభాగ్యం

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం శ్రీరాముడి అలంకారంలో నృసింహుడు భక్తులకు దర్శనమిచ్చి తరింపజేశాడు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో లక్ష్మీనృసింహుడిని శ్రీరాముడిగా దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు హనుమంతుడి వాహనంపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అలంకార సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం ప్రధానాలయ తూర్పు రాజగోపురం ఎదుట వేదికపై అలంకారసేవను అధిష్ఠింపజేసి, ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు రామావతారం గురించి వివరించారు.



శ్రీరాముడి అలంకారంలో ఊరేగుతున్న స్వామివారు



నృసింహుడి కల్యాణ వేదిక, బాణాసంచా వెలుగులు



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, ఎమ్మెల్యే బీర్ల



పట్టువస్త్రాల సమర్పణ

పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి, అమ్మవార్లకు బ్ర హ్మోత్సవ కల్యాణ పట్టువస్త్రాలను ఆలయ అనువంశి క ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి భాస్కర్ రావు దంపతులు కల్యాణ వేదికపై అర్చకస్వాములకు అందజేశారు.

అనుమానాస్పద లావాదేవీలపై సమాచారం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ టౌన్, మార్చి 18: పార్లమెంట్ ఎన్నికల ఎడ్యూల్ విడుదలైనందున అనుమానాస్పద లావాదేవీలపై జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీకి సమాచారం ఇవ్వాలని బ్యాంకర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా నగదుతో పాటు, ఆభరణాలు, వస్తువులు పంపిణీ చేసే అవకాశం ఉందని, వీటిపై గట్టి నిఘా ఉంటుందన్నారు. ప్రత్యేకించి బ్యాంకుల ద్వారా నిర్వహించే అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంకర్లు దృష్టి సారించి వివరాలను తక్షణమే పోలీస్ లేదా జిల్లాస్థాయి కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్, ఇన్‌కంటాక్స్, జీఎస్టీ శాఖల అధికారులు ఎన్నికల నిబంధనల మేరకు విధులు నిర్వహించాలన్నారు. ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ, బ్యాంకర్లు అనుమానాస్పద లావాదేవీలతో పాటు, గూగుల్‌పే, ఫోన్‌పే నుంచి ఎక్కువ మొత్తంలో నగదు పంపడం, అదే విధంగా ఏదైనా షాపులకు ఎక్కువ మొత్తంలో కూపన్లు ఇవ్వడంపై దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా నగదు, మద్యం వంటివి పంపిణీ చేస్తున్నప్పుడు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలకు ఫోన్ కాల్ వస్తే తక్షణమే స్పందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, టి.పూర్ణచందర్, అదనపు ఎస్పీ రాములునాయక్, జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీ నోడల్ అధికారి, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

నల్లగొండ, మార్చి 18: జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 109 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 19,326మంది విద్యార్థులకు 19,175మంది హాజరుకాగా, 151మంది గైర్హాజరయ్యారు. అందులో రెగ్యులర్ విద్యార్థులు 19,303మందికి 19,157మంది హాజరుకాగా, 146మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 23మందికి 18మంది హాజరు కాగా, ఐదుగురు గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదు. జిల్లా వ్యాప్తంగా 63 పరీక్షా కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ దాసరి హరిచందన తనిఖీ చేశారు. ఎవరైనా విద్యార్థులు పరీక్షకు ఆలస్యంగా వచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో మొబైల్ ఫోన్‌ను అనుమతించవద్దని పోలీసులను ఆదేశించారు. కేంద్రాల్లో అవసరమైన తాగునీరు, ప్రథమ చికిత్స వంటివి ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల పరిధిలో 144సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలన్నారు. కలెక్టర్ వెంట డీఈవో భిక్షపతి, తదితరులు ఉన్నారు.

గ్రామీణ మహిళలపై హింస నివారణకు నేడు వర్క్‌షాప్

నల్లగొండ, మార్చి 18: వ్యవసాయ సంక్షోభంతో గ్రామీణ మహిళలపై పెరిగిన నిర్మాణాత్మక హింస నివారణపై కూలంకుషంగా చర్చించేందుకు మంగళవారం జిల్లా కేంద్రంలోని హోటల్ మనోరమలో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు గ్రామ్య రిసోర్స్ సెంటర్ ప్రతినిధి వి.రుక్మిణీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోపేకామ్, మహిళా కిసాన్ అధికార్ మంచ్ (మకామ్), గ్రామ్య రిసోర్స్ సెంటర్ సంయుక్తంగా ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో వ్యవసాయ సంక్షోభ నేపథ్యంలో మహిళలపై పెరిగిన హింస, అప్పులు, కౌలు స్థితి తదితర అంశాలపై ఈ సంస్థ మహారాష్ట్ర, తెలంగాణలోని పలు రైతు కుటుంబాల స్థితిగతులను అధ్యయనం చేసింది. జిల్లాలోని కట్టంగూరు, దేవరకొండ, మిర్యాలగూడ మండలాల్లో జరిపిన అధ్యయనం, దాని అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

ఎకరాకు రూ. 25వేల పరిహారమివ్వాలి

చిట్యాలరూరల్, మార్చి 18: పంటలు చేతికందే సమయంలో భూగర్భజలాలు అడుగంటి ఎండిపోతున్నాయని, ప్రభుత్వం ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు పరిహారమిచ్చి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బొంతల చంద్రారెడ్డి, బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వెలిమినేడులో ఎండిపోయిన వరిచేలను పరిశీలించి, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పులు చేసి పంటలు సాగు చేశారని, దిగుబడి రాకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా తయారైందని వాపోయారు. కార్యక్రమంలో అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, ఐతరాజు నర్సింహ, అరూరి శ్రీను, శీలా రాజయ్య, రాములు, దేశబోయిన స్వరూప, శంభయ్య, మామిడి రాములు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



గత ప్రభుత్వం వానాకాలం, యాసంగిలో సగం మంది రైతులు ధాన్యం విక్రయించాక ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈలోగా రైతులు వ్యాపారులు, దళారులకు ధాన్యం విక్రయించారు. మద్దతు ధర లభించక, తరుగు పేరుతో కోత, బస్తాల్లో నింపకున్నా బస్తాల పేరుతో కోత, వెంటనే డబ్బులు ఇవ్వక పోయినా 2శాతం కమీషన్, గుమస్తా మామూలు, వేబ్రిడ్జి చార్జీ, తూకం వేయకపోయినా హమాలి అంటూ రకరకాల కోతలతో రైతులు నష్టపోయారు. ప్రస్తుత సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ నెల చివరి వారంలో వరి కోతలు ఊపందుకుంటాయి. అయినా ప్రభుత్వం నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు.

- మోత్కూరు

ధాన్యం కొనుగోళ్లు ఎన్నడో?

» ప్రారంభమైన వరి కోతలు » బోనస్ ప్రకటన కోసం రైతుల ఎదురు చూపు

ఏటా యాసంగిలో మార్చి నెలలో వరి కోతలు ప్రారంభమవుతాయి. ఇది తెలిసినా ప్రభుత్వాలు ఏప్రిల్ రెండో వారం, లేదా మూడో వారంలో ధాన్యంకొనుగోలు కేంద్రాలు నెమ్మదిగా ప్రారంభించడం రివాజుగా మారింది. మార్చిలో వరి కోసిన రైతులు 20, 30 రోజులు ధాన్యాన్ని నిల్వచేయలేక వెంటనే వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు. వెంటనే ధాన్యం విక్రయించకుంటే అకాల వర్షాలు కురిస్తే తడిచే ప్రమాదం ఉంది. ఈ భయంతో రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని వెనువెంటనే వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కాగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వాల ఒరవడినే కొనసాగిస్తుందా లేక సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందా అని రైతులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి మార్చి చివరివారంలోనైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

గతంలో 858 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 858 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. నల్లగొండలో 278, సూర్యాపేటలో 278, యాదాద్రిభువనగిరి జిల్లాలో 302 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తారన్నది ఇంకా నిర్ణయించలేదని అధికారులు చెబుతున్నారు. యాసంగిలో ఉమ్మడి జిల్లాలో 9,37,684 ఎకరాల్లో వరి సాగైంది. యాదాద్రి జిల్లాలో 3,11,421 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 2,06,263 ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 4,20,000 ఎకరాల్లో వరి సాగైంది. వర్షాభావ పరిస్థితులతో గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది వరి సాగు తగ్గింది. దీంతో ధాన్యం దిగుబడి తగ్గనుండటంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల సంఖ్య కూడా తగ్గే అవకాశం ఉంది.

బోనస్ ఇచ్చేనా?

ప్రభుత్వ మద్దతు ధర ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2183గా ఉంది. ఇది మద్దతు ధర మాత్రమేగానీ గిట్టుబాటు ధరకాదు. రైతు పంటకు గిట్టుబాటు కల్పించడం కోసం గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇవ్వడంతోపాటు మేనిఫెస్టోలో పెట్టింది. దీంతో ఈ యాసంగి సీజన్ నుంచి ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందా లేదా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. బోనస్ విషయమై ప్రభుత్వం ఏమైనా ఆలోచన చేస్తోందా అని రైతులు అధికారులను ఆరా తీస్తున్నారు.

బోనస్ ఇస్తే ఎకరాకు రూ.14వేల వరకు ఆదాయం

రైతుకు ఎకరాకు 30 నుంచి 40 బస్తాల (21 నుంచి 28 క్వింటాళ్ల) ధాన్యం దిగుబడి వస్తుంది. ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తే ఒక్కో రైతుకు ఎకరాకు రూ.10,500 నుంచి రూ.14,000 వరకు అదనంగా ఆదాయం వస్తుంది. దీంతో ఈ యాసంగి సీజన్ నుంచే ధాన్యానికి బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి



గత ప్రభుత్వం ఏటా ఆలస్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో సగం మంది రైతులు వ్యాపారులు, దళారులకు ధాన్యం విక్రయించి ఆర్థికంగా నష్టపోయేవారు. ఈ ప్రభుత్వమైనా మార్చి చివరి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోళ్లు ప్రారంభించాలి. రైతుల ఆకాంక్ష, ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఈ యాసంగి నుంచే క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలి.

- యానాల దామోదర్‌రెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు కలిగించవద్దు

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిల్లర్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

మిర్యాలగూడ, మార్చి 18: రైతులు మిల్లు పాయింట్ల వద్దకు తెచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో జాప్యం జరిగితే సహించేది లేదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నా రు. సోమవారం రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో మిల్లర్లతో ఎమ్మెల్యే బీఎల్‌ఆర్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యాసంగి వరికోతల ప్రారంభ సమయంలో క్వింటా సన్నధాన్యానికి రూ.2,700 ధరకు కొనుగోలు చేసిన మిల్లర్లు ప్రస్తుతం రూ.2250-రూ.2300 వరకు మాత్రమే చెల్లిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారని అన్నారు. కొన్ని మిల్లులు మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తున్నాయని, మిల్లర్లంతా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. దిగుమతి విషయంలో ఇబ్బందులకు గురిచేస్తే మిల్లులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ, మార్కెటింగ్, మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక మొబైల్ బృందాన్ని ఏర్పాటు చేసి దిగుమతుల్లో జాప్యం లేకుండా చూస్తామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్‌పోస్టుల వద్ద తనిఖీ బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రైతుల సమస్య పరిష్కారం కాకుంటే టోకెన్ విధానం అమల్లోకి తెస్తామన్నారు.

మంత్రులకు వసూళ్లు తప్ప రైతుల గోడు పట్టదు

సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



ఎండిన పొలాలను పరిశీలిస్తున్న జగదీష్‌రెడ్డి, కంచర్ల

నల్లగొండ, మార్చి 18: కాంగ్రెస్ మంత్రులకు రాజకీయాలు, అక్రమవసూళ్లు తప్ప రైతుల గోడు పట్టడం లేద ని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామంలో ఎండిన పొలాలను మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎండిన పంట పొలాలే కనిపిస్తున్నాయని, ఏ ఒక్క మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు కూడా రైతుల వంక కన్నెత్తి చూడటం లేదని మండిపడ్డారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌లు ఉత్తర కుమారులు అని, ప్రగల్భాలు పలకడం తప్ప దేనికీ పనికిరారని అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనున్న నారాయణపురం, ఆల్మట్టి డ్యాంల నుంచి నీటిని విడుదల చేయించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కళ్లు తెరచి కరువుపై సర్వే చేయించి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు.



బ్లాస్టింగ్‌కు యత్నించిన ఇద్దరి రిమాండ్

వలిగొండ, మార్చి 18: నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూమిలో అక్రమ బ్లాస్టింగ్‌కు యత్నించిన ఇద్దరిని పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని లింగరాజుపల్లికి చెందిన నందినూరు రమేష్‌కు వలిగొండ మండల పరిధి అర్రూరులో వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో బండలను తొలగించడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఆత్మకూరు(ఎం)కు చెందిన కొమ్మగాని శ్రీధర్‌తో బ్లాస్టింగ్ చేయించి బండలను తొలగించడానికి ఒప్పందం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ 53జెలిటిన్ స్టిక్స్ ఒక కట్ట కనెక్టింగ్ వైర్, ఒక మెఘర్ బాక్స్ మరో కనెక్ట్ వైర్(తెలుపు) గుర్తించి సీజ్ చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హరిహరులకు విశేష పూజలు


ప్రధానాలయ ముఖమండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం

యాదగిరిగుట్ట, మార్చి 18: యాదగిరీశుడి సన్నిధిలో సోమవారం హరిహరులకు విశేష పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. స్వయంభూ పాంచనారసింహుడికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో, కొండపైన అనుబంధ శివాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడికి శైవాగమ పద్ధతిలో నిత్యవిధి కైంకర్యాలను నిర్వహించారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపిన ఆచార్యులు నిత్యవిధి కైంకర్యాలు నిర్వహించారు. కొండపైన అనుబంధ ఆలయమైన శివాలయంలో పర్వతవర్థినీ సమేత రామలింగేశ్వరుడిని, మహామండపంలోని స్ఫటిక మూర్తులను అర్చకులు వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల సహస్రనామ పఠనాలతో బిల్వపత్రార్చనలు చేశారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల అలంకార వెండి జోడు సేవలు, శివాలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి, తిరువీధుల్లో సేవోత్సవం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.29,54,302 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

స్వామి సేవలో నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం

యాదగిరీశుడిని న్యూఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొనగా, అర్చకులు ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. వీరు గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామవతార అలంకార సేవలో పాల్గొనగా అర్చకులు వీరికి స్వామివారి ఆశీస్సులను అందజేశారు. ముందుగా క్షేత్ర సందర్శనకు విచ్చేసిన వీరికి జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టడీ టూర్ ఎకనామిక్ సెక్యూరిటీ కార్యక్రమంలో భాగంగా మేజర్ జనరల్ ఏకే.సింగ్ ఆధ్వర్యంలో 16మంది బృందం తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా యాదగిరిక్షేత్రాన్ని సందర్శించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట దేవస్థాన ఈవో ఎ భాస్కర్‌రావు, అదనపు కలెక్టర్ గంగాధర్, ఆర్డీవో అమరేందర్ ఉన్నారు.






మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి

నల్లగొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 18: దేశంలో బీజేపీ హవా నడుస్తోందని, యావత్ దేశం మొత్తం మోదీ మూడోసారి ప్రధాని కావాలని కోరుతోందని నల్లగొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశరక్షణకు మోదీ చిరునామా అని, అయోధ్య రామాలయం ప్రజల మధ్య ఐక్యతను చాటుతుందన్నారు. రామాలయ నిర్మాణం ఒక్క మోదీ వల్లే సాధ్యమైందన్నారు. ఆరు గ్యారెంటీల స్కీం అబద్ధాల స్కీం అన్నారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తుందని ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష లేదన్నారు. నల్లగొండ పార్లమెంట్‌లో త్వరలో మంచి మేనిఫెస్టోతో ప్రజల్లోకి వెళ్తానన్నారు. నల్లగొండలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, సాగర్ నియోజకవర్గ నాయకురాలు కంకణాల నివేదితారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి పోతేపాక లింగ స్వామి, ఉపాధ్యక్షుడు మిరియాల వెంకటేశం, మండల వెంకన్న, శిరీష, భూపాల్‌రెడ్డి, రాజీ, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.









దాడి కేసులో వ్యక్తికి తొమ్మిది నెలల జైలుశిక్ష

గుర్రంపోడు, మార్చి 18: ఇద్దరి వ్యక్తులపై కర్రలతో దాడి చేసి కొట్టి గాయపర్చిన వ్యక్తికి తొమ్మిది నెలలు జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ దేవరకొండ మున్సిఫ్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు గ్రామానికి చెందిన మర్రి సరిత ఆమె తండ్రి జాల శ్రీనులను అదే గ్రామానికి చెందిన జాల కామయ్య గత సంవత్సరం దాడి చేసి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేసుకుని అభియోగ పత్రం దాఖలు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంతోష్‌కుమార్ వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలతో సహా నేరం రుజువు కావడంతో నిందితుడికి తొమ్మిది నెలల జైలుశిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ జడ్జి సోమవారం తీర్పు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో మహిళ..

పాలకవీడు, మార్చి18: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం కల్మెట్‌తండాలో జరిగింది. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కల్మెట్‌తండాకు చెందిన రూపావత్ లలిత(32) తెగి ఉన్న విద్యుత్ వైర్‌ను గమనించక ఇంట్లో బండలు, గోడలు కడుగుతుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. లలితకు భర్త, కుమార్తె ఉన్నారు. భర్త రూపావత్ రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

పెన్‌పహాడ్, మార్చి 18: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని నాగులపాటి అన్నారం బ్రిడ్జి గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం మండలం బోర్రాయిపాలెం అన్నారం గ్రామానికి చెందిన ఆవుల కోటయ్య(58) సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన పర్వతం చంద్రయ్య వద్ద కుటుంబ అవసరాల నిమిత్తం రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. కొన్నికారణాలతో అప్పు తీర్చలేకపోయాడు. తన అప్పు తీర్చాలని బోర్రాయిపాలెం అన్నారం గ్రామానికి వెళ్లి నెల రోజుల క్రితం చంద్రయ్య ఆవుల కోటయ్యను నిలదీశాడు. తర్వాత ఇస్తామని చెప్పినా వినకుండా కోటయ్యను అన్నారం బ్రిడ్జి గ్రామానికి చంద్రయ్య తీసుకొచ్చి అప్పు కింద(జీతం) పని చేయించుకుంటున్నాడు. సోమవారం ఉదయం ఆరు గంటలకు పర్వతం చంద్రయ్య కోటయ్య పెద్ద కుమారుడు ఆవుల శేఖర్‌కు ఫోన్ చేసి నీ తండ్రి కోటయ్య ఉరి పెట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పాడు. వెంటనే కోటయ్య కుటుంబ సభ్యులు, బంధువులు అన్నారం బ్రిడ్జి గ్రామంలోని సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉరి వేసుకున్న తీరును గమనించి అనుమానం వ్యక్తం చేశారు. చంద్రయ్య, అతని కుటుంబ సభ్యులే హత్య చేసి, ఉరి పెట్టుకున్నాడని చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ మృతదేహాన్ని చంద్రయ్య ఇంట్లో వద్ద ఉంచి ఆందోళనకు దిగారు. పెన్‌పహాడ్ ఎస్ఐ రవీందర్, డ్వాగ్ స్క్వాడ్ తీసుకువచ్చి విచారణ జరిపించారు. దీంతో సంతృప్తి చెందని మృతుడి బంధువులు అందోళన ఉధృతం చేశారు. దీంతో



కోటయ్య మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు

సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలు, ఆత్మకూర్(ఎస్) ఎస్ఐ సైదులు, పెన్‌పహాడ్ ఎస్ఐ రవీందర్‌ల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులకు రూ.3.70లక్షలు నష్టపరిహారం చెల్లిస్తామని పర్వ తం చంద్రయ్య వారి కుటుంబ సభ్యులు, కోటయ్య కుటుంబ సభ్యులకు హామీ పత్రం రాసి ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కోటయ్య కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. కోటయ్యకు భార్య వెంకటమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.



కోటయ్య(ఫైల్)

అనిశెట్టిదుప్పలపల్లిలో గుర్తుతెలియని వ్యక్తి హత్య



తిప్పర్తి, మార్చి 18: గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లి గ్రామం శివారులో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిశెట్టిదుప్పలపల్లి గ్రామానికి చెందిన సక్కుబాయి అనే మహిళకు చెందిన వ్యవసాయ బావిలో గుర్తుతెలియని 35 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని తాళ్లతో కట్టి నీటి బావిలో పడేశారు. అదే వ్యవసాయ బావి వద్ద కౌలు రైతు పవన్ సోమవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్తుండగా బావిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బావిలో ఉన్న వ్యక్తి మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

ఇద్దరిని బలిగొన్న రోడ్డు ప్రమాదాలు

నల్లగొండ టౌన్, చిట్యాల రూరల్, మార్చి 18: నల్లగొండ జిల్లాలో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో బైక్ అదుపు తప్పడంతో కింద పడి యువకుడు, చిట్యాల మండలంలో కారు ఢీకొని మరో వ్యక్తి మృతిచెందాడు. అనుమల మండలం చల్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన నాగార్జున వేణు, వంగూరి కోటేశ్వర్(25) స్నేహితులు. వృత్తి రీత్యా ఇద్దరూ పెయింటర్లు. వేణు నల్లగొండలో అద్దెకు ఉంటుండగా, కోటేశ్వర్ మాత్రం గ్రామంలో ఇంటి వద్ద ఉంటూ నల్లగొండలో పెయింటింగ్ పనులకు వచ్చేవాడు. ఈ క్రమంలో ఆదివారం నల్లగొండకు వచ్చిన కోటేశ్వర్ స్నేహితుడు నాగార్జున వేణు గదికి వెళ్లాడు. అటు నుంచి స్నేహితులిద్దరూ రాత్రి వేణు బైక్‌పై తమ స్వగ్రామానికి బయలుదేరారు. జిల్లాకేంద్రంలోని బీటీఎస్ ప్రాంతంలో రోడ్డు పనులు జరుగుతుండటంతో అది గమనించకుండా అజాగ్రత్తగా బైక్ నడపడంతో బైక్ వెనుక ఉన్న కోటేశ్వర్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్రంగా గాయం కావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కోటేశ్వర్ తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.



కోటేశ్వర్(ఫైల్)

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని..

చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో సోమవారం రాత్రి కారు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దకాపర్తి శివారులో రహదారి పక్కన గల గాంధీ గుడికి ఎదురుగా ఉన్న గుట్ట ప్రాంతంలో జరుగుతున్న కట్టడాల వద్ద కూలీ పనిచేసే వ్యక్తి రాత్రి సమయంలో రోడ్డు దాటి గాంధీగుడి సమీపంలో గల హోటల్ వద్దకు వెళ్లి తిరిగి తాను ఉండే ప్రాంతానికి నిద్రించేందుకు రోడ్డు దాటి వెళుతున్నాడు. ఈ క్రమంలో రహదారిపై వాహనాలు వస్తుండడంతో రోడ్డు దాటుతున్న అతను ఆందోళనలో రోడ్డును దాటూతూ అటూ ఇటూ తచ్చాడే సమయంలో హైదరాబాద్ వైపునకు వెళుతున్న టీఎస్08 జీఎస్4696 నంబరు గల కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. రోడ్డు ప్రమాద విషయమై చిట్యాల ఎస్ఐ సైదాబాబును సంప్రదించగా మృతుడి వివరాలు తెలియరాలేదని, ఫిర్యాదు కూడా అందలేదని ఆయన తెలిపారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అదుపు తప్పి ఆలయంలోకి దూసుకెళ్లిన కారు



ఆలయంలోకి దూసుకెళ్లిన కారు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 18: మద్యం మత్తులో యువకుడు కారు నడపడంతో అదుపు తప్పి ఆలయంలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. నల్ల పోచమ్మ దేవాలయంలోని నాభిశిలతోపాటు ఆలయ మండపం, స్తంభం ధ్వంసమైంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన సీత సంజయ్ అనే యువకుడు కారులో ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపాడు. అయితే పట్టణంలోని ఎస్‌డబ్ల్యూ బాలికల వసతి గృహం వద్ద రోడ్డుపై మూలమలుపు వద్ద అతివేగంగా వెళ్తూ తప్పించబోయే క్రమంలో పక్కనే ఉన్న నల్ల పోచమ్మ దేవాలయంలోకి కారు దూసుకెళ్లింది. ఆలయం ముందున్న నాభిశిల(బొడ్రాయి)తోపాటు ఆలయం మండలం పిల్లర్‌ను కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న బెలూన్‌లు విప్పుకోవడంతో డ్రైవర్ సీటులో ఉన్న సీత సంజయ్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆలయం పూర్తిగా ధ్వంసమైంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని చేరుకున్నారు. కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పార్టీ విధేయతకు దక్కిన ఫలితం

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పటేల్



సూర్యాపేటటౌన్, మార్చి 18: కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉన్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డికి రాష్ట్ర స్థాయిలో కీలక పదవి దక్కింది. ఆయనను తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. పటేల్ రమేష్‌రెడ్డి సూర్యాపేట జిల్లా బాలెంల గ్రామంలో 1970లో జన్మించారు. 1995లో బాలెంల సర్పంచ్‌గా తన రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టారు. 2001లో ఎంపీటీసీగా గెలుపొందారు. 2006వసంవత్సరంలో తన భార్య పటేల్ లావణ్యను జడ్పీటీసీగా గెలిపించుకున్నారు. 2014లో అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన ఓటమి చెందారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిన్ననాటి స్నేహితుడైన పటేల్ 2019లో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే సందర్భంలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి సూర్యాపేట అభ్యర్థిగా టికెట్ ఆశించినా దక్కలేదు. మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి కేటాయించారు. అదేవిధంగా 2023 సంవత్సర అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి సూర్యాపేట అసెంబ్లీ నియోజకర్గం నుంచి కాంగ్రెస్ తరుపున మళ్లీ టికెట్ ఆశించగా రెండో సారికూడా భంగపాటు తప్పలేదు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది అదికారంలోకి రాగా 2024 మార్చిలో పటేల్ రమేష్‌రెడ్డి రాష్ట్ర పర్యటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులయ్యారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రీతం



మోత్కూరు, మార్చి 18: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు పట్టణానికి చెందిన నాగరిగారి ప్రీతం ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన రెండు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీకి విధే యుడిగా ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ప్రీతం 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తుం గతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ కోసం పోటీ పడినా టికెట్ దక్కలేదు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆయనకు ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి వరించింది. 2002లో ఎన్ఎస్ యూఐలో చేరిన ఆయన అంచెలంచెలుగా ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్‌లో పలు పదవులు నిర్వహిం చారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. కొవిడ్ కాలంలో ఆయన ప్రజలకు పలు రకాల సేవలు అందించారు. 2021 జూన్‌లో అడ్డగూడూ రులో జరిగిన మరియమ్మ లాకప్‌డెత్ సంఘటనపై పోరాడారు. అప్పటి అసెంబ్లీలో కాంగ్రెస్ పక్షనేత భట్టి విక్రమార్కతో కలిసి బాధిత కుటుం బానికి కేసీఆర్ ప్రభుత్వంతో తగిన ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించి న్యాయం చేకూర్చడంతో పాటు ఆ సంఘటనకు కారుకులైన ఎస్ఐని, ఇద్దరు కానిస్టేబుళ్లను ఉద్యోగాల నుంచి తొలగించే వరకు పోరాడారు. తనకు ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చినందుకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఉమెన్స్ కోఆపరేటివ్ సంస్థ చైర్మన్‌గా శోభారాణి



ఆలేరు రూరల్, మార్చి 18: రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బండ్రు శోభారాణి నియమితులయ్యారు. రైతుల హక్కుల పరిరక్షణ, బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం 1989లో నక్సలైట్‌గా అడవి బాట పట్టారు. అనంతరం చోటు చేసుకున్న పరిస్థితులు రాజకీయాల్లోకి రావడంతో బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో పలు కీలక పదవుల్లో పనిచేశారు. మెదక్ జిల్లా రామాయణపేటలో 20 జూలై 1972లో ఆమె జన్మించారు. 1987లో దొంగలధర్మారం జడ్పీహెచ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, 1989లో రామాయణపేటలో ఇంటర్, 1997లో ఆలేరు కేంద్రంగా నడుస్తున్న బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పట్టా సాధించారు. ఆలేరుకు చెందిన ప్రముఖ కమ్యూనిస్టు నేత బండ్రు నర్సింహులు కుమారుడు బండ్రు భాస్కర్‌తో నక్సలైట్ పార్టీ పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. 2001లో ఉద్యమాలకు స్వస్తి చెప్పి నారాయణపేట జడ్పీటీసీగా స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి రాజకీయ అరంగేట్రం చేశారు. 2022లో కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆమెకు కార్పొరేషన్ పదవి వరించింది. పదవి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా వీరయ్య



గరిడేపల్లి, మార్చి 18: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కట్టవారిగూడెంలో రైతు కుటుంబంలో జన్మించిన ముత్తినేని వీరయ్య సామాన్య కాంగ్రెస్ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించారు. అప్పటి నుంచి ఆయన పార్టీ నియమావళికి కట్టుబడి పనిచేస్తున్నారు. ఆయన నిబద్ధతను గుర్తించిన పార్టీ రాష్ట్ర వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించింది. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ మేథమెటిక్స్, ఎంఫిల్ మేథమెటిక్స్, బీఎడ్ చేశారు. వితంతువులు, వృద్ధులు, దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి పలు ఉద్యమాలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు అన్యాయం జరుగుతుందని 2012లో ఇందిరా పార్కు వద్ద అర గుండుతో నిరసన తెలిపారు. మునగాల ప్రాంతాన్ని భద్రాచలంలో కలిపి ఆంధ్రాలో కలపాలని ప్రతిపాదనలు వచ్చిన సమయంలో వికలాంగుల ఆధ్వర్యంలో ఎన్‌హెచ్-9పై ఎనిమిది గంటల పాటు ఆందోళన చేశారు. 2017లో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖను స్త్రీ శిశు సంక్షేమ శాఖలో విలీనం చేసినప్పుడు దానిని రద్దు చేయాలని గాంధీభవన్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేశారు. పార్టీకి అనేక విధాలుగా తన వంతు సేవలు అందించడంతో రాష్ట్ర ప్రభుత్వంలో వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియ పదవి వరించిందని ఆయన తెలిపారు.

తుంగతుర్తిలో హిజ్రాల వీరంగం

- పరస్పర దాడులకు పాల్పడ్డ రెండు వర్గాలు
- సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు

తుంగతుర్తి, మార్చి 18: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో సోమవారం హిజ్రాలు వీరంగం సృష్టించారు. రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఈ గొడవ సినిమా ఫైట్‌ను తలపించే విధంగా ఉండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానిక పోలీసులు తెలిపిన వివవరాల ప్రకారం... తుంగతుర్తి మండల కేంద్రంలో ప్రతి సోమవారం సంత జరుగుతుంది. అందులో భాగంగా భిక్షాటన చేయడానికి తిరుమలగిరి, సూర్యాపేటకు చెదిన ఇరు వర్గాల హిజ్రాలు సోమవారం తుంగతుర్తికి చేరుకున్నారు. తుంగతుర్తి ప్రాంతం సూర్యాపేట హిజ్రాలకు చెందిందని.. మీరు ఇక్కడికి ఎందుకు వస్తారని తిరుమలగిరి హిజ్రాలతో గొడవ జరిగింది. చిన్న ఘర్షణ కాస్త సినిమా ఫైట్‌ను తలపించే జరిగింది. మధ్యాహ్నం ప్రజలందరూ చూస్తుండగానే బాహాబాహీకి దిగారు. తిరుమలగిరి హిజ్రా గ్రూపులకు చెందిన వారు ఇటీవల అర్వపల్లి ప్రాంతంలో సూర్యాపేట వారు వచ్చి డబ్బులు వసూలు చేశారని ఇప్పుడు తుంగతుర్తి ప్రాంతానికి తిరుమలగిరి వచ్చి డబ్బులు వసూలు చేస్తుండడంతో ఒకరి ప్రాంతాల్లోకి ఒకరు రావడంతో ఘర్షణ చోటుచేసుకుంది. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా హిజ్రాలు కొట్టుకోవడంతో సుమోటోగా కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.



తుంగతుర్తి మండలకేంద్రంలో ఘర్షణ పడుతున్న హిజ్రాలు

173 లీటర్ల మద్యం పట్టివేత

వేములపల్లి, మార్చి 18: అక్రమంగా నిల్వ ఉంచిన 173 లీటర్ల మద్యాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ డి.విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా వేముపల్లి మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన ఉత్తెర్ల మధు అనుమతులు లేకుండా తన ఇంట్లో మద్యం నిల్వ ఉంచారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 173లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ సుమారు రూ.1.62లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, మధుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలల హక్కులను పరిరక్షించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న అంజన్‌రావు

మర్రిగూడ, మార్చి 18: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు పొనుగోటి అంజన్‌రావు అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలోని గాంధీజీ పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. బాలల హక్కులను కాపాడే బాధ్యత కేవలం కమిషన్‌పైనే కాకుండా ప్రతి ఒక్కరిపైనా ఉంటుందని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న చిన్నారులను కాపాడేందుకు జిల్లా చైల్డ్‌లైన్ పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గురువారావు, వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ మతీన్‌అహ్మద్, జిల్లా బాలల సంక్షేమ సమితి కమిటీ సభ్యుడు ఈద భాస్కర్, గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో కుంభకోణంపై విచారణ జరిపించాలి


వినతిపత్రం అందజేస్తున్న డైరెక్టర్ జానకిరెడ్డి

నల్లగొండ, మార్చి 18: కట్టంగూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని కట్టంగూరు పీఏసీఎస్ డైరెక్టర్ కట్ట జానకిరెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏవో మోతీలాల్‌కు వినతిపత్రం సమర్పించి ఫిర్యాదు చేశారు. పాలకవర్గ సమయం ముగిసిన కూడా అనధికారికంగా పదవిలో ఉంటూ పీఏసీఎస్ ఆదాయానికి గండికొడుతున్నారని తెలిపారు. కట్టంగూరు పీఏసీఎస్ పాలకవర్గం 2016 సంవత్సరం డిసెంబరు 8వ తేదీన ఎన్నికై 2021 డిసెంబరు 7వ తేదీన కాలపరిమితి ముగిసింది అన్నారు. కానీ ఎన్నికలు పెట్టకుండా డైరెక్టర్లు లేకున్నా పాలకవర్గాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. మండలంలోని దుగినవెల్లి, మల్లాపురం, కల్మెర పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీసీఎస్‌గా మార్చి ధాన్యం కొనుగోలు చేశారని అన్నారు. కొంతమంది పాలకవర్గ సభ్యులు, సీఈవో మరికొంత మందిని బినామీలుగా పెట్టుకుని సంఘాలుగా సృష్టించి లబ్ధి పొందారని ఆయన ఆరోపించారు. ఈ ఏడాది జనవరి 20వ తేదీన కట్టంగూరు పీఏసీఎస్ సీఈవోకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు స్పందించడం లేదన్నారు. తక్షణమే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఎంపీసీఎస్‌లుకు సంబంధించిన లావాదేవీలపై విచారణ జరిపించాలని ఆయన కోరారు.

కామర్స్ ఫెస్ట్‌లో సత్తా చాటిన పట్టణ విద్యార్థిని


లక్ష్మీప్రసన్నను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

మిర్యాలగూడ టౌన్, మార్చి 18: పట్టణంలోని విజేత కళాశాల బీకామ్ విద్యార్థిని వై.లక్ష్మీప్రసన్న కామర్స్ ఫెస్ట్‌లో సత్తా చాటింది. ప్రేరణ - 2024 కార్యక్రమంలో భాగంగా ఎంజీయూలో నిర్వహించిన స్టేట్ లెవల్ కామర్స్ ఫెస్ట్‌లో జస్ట్ ఏ మినిట్, బిజినెస్ క్విజ్ తదితర విభాగాల్లో లక్ష్మీప్రసన్న ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ్ మాట్లాడుతూ తెలంగాణ కామర్స్ అసోసియేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కామర్స్ ఫెస్ట్‌లో తమ విద్యార్థిని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవడం ఆదర్శనీయమన్నారు. కామర్స్‌తో ఆర్థిక, విజ్ఞాన రంగాల్లో అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అభివృద్ధి చెందుతున్న ఆధునిక వ్యవస్థలో ఒకటి కంటే ఎక్కువ రంగాల్లో నైపుణ్యం అవసరమని, అందుకు కామర్స్ కోర్సులు ఉపకరిస్తాయన్నారు. కామర్స్‌లో రాణించే విద్యార్థులకు బహుళజాతి సంస్థలు ఆహ్వానం పలుకుతున్నాయని, సాంకేతిక విద్యకు దీటుగా కామర్స్ మారిందన్నారు. అనంతరం లక్ష్మీప్రసన్నతో పాటు సెమిస్టర్ ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో మధు, ప్రభాకర్, జ్యోతి, సంధ్య, కౌసర్, స్వప్న, సాదియ, స్వామి, బాలాజీ, సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి గుడికి శంకుస్థాపన వాయిదా

చిట్యాలరూరల్, మార్చి 18: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి గుడిని నిర్మించేందుకు ఈ నెల 19వ తేదీన చేపట్టనున్న శంకుస్థాపన కార్యక్రమం వాయిదా వేసినట్లు మేడి సంతోష్‌కుమార్ తెలిపారు. చిట్యాల మండలం వనిపాకల గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డికి గుడిని నిర్మించాలని నిర్ణయించారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ పార్లమెంట్ ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున ఉల్లంఘించకుండా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకుల సూచనల మేరకు గుడి నిర్మాణాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. తమ అభిమాన నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గుడిని నిర్మించుకుంటున్నామని తామంతా ఎంతో ఆశతో ఉండగా ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో ఈ కార్యక్రమం వాయిదాతో నిరాశ ఎదురైనదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయిన తర్వాత శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం


నల్లగొండ పట్టణంలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు


పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ నెంబర్ చూసుకుంటున్న విద్యార్థులు


నల్లగొండలోని ఓ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్


నల్లగొండలో పూజలు చేస్తున్న విద్యార్థినులు


పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు


అడవిదేవులపల్లిలో పరీక్ష కేంద్రం వద్ద తనిఖీలు


పరీక్ష కేంద్రంలో విద్యార్థులు


కొండమల్లేపల్లిలో విద్యార్థినుల దరహాసం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

నల్లగొండ జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నల్లగొండ జిల్లాలో మొత్తం 109 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 19,326 మందికి గాను 19,175 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలకు 151మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎక్కడ మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. కలెక్టర్ దాసరి హరిచందన జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్షల తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష కేంద్రంలోకి ఎట్టి పరిస్థితులలోనూ మొబైల్ ఫోన్లు అనుమతించవద్దని పోలీసులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈవో భిక్షపతి, జిల్లా అధికారులు ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

● మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామంలో జడ్పీ హైస్కూల్‌లో మొర శ్రీవాణి అనే దివ్యాంగురాలు పది పరీక్షలు రాయడానికి పరీక్ష కేంద్రానికి వరకు తన తండ్రి సహాయంతో పరీక్షలకు హాజరైంది.

● హాలియాలో పదో తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులకు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హాలియా ఆధ్వర్యంలో 20 కూల్ వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు.

● శాలిగౌరారంలో విద్యార్థులకు చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను డీటీ మహ్మద్ అబ్దుల్‌సత్తార్, ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ పంపిణీ చేశారు.


నల్లగొండ పట్టణంలోని సెయింట్ ఆల్ఫోన్సిస్ వద్ద సందడి


కనగల్‌లో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినుల నిరీక్షణ


తిప్పర్తి : పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు


శాలిగౌరారం : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలుచేయాలి


వేములపల్లిలో పోలింగ్‌స్టేషన్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు


మునుగోడులో నూతనంగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

వేములపల్లి, మునుగోడురూరల్, మార్చి 18: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినందున ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని ఆర్డీవో శ్రీనివాస్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని వేములపల్లి జడ్పీ హైస్కూల్‌లోని సోమవారం పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించి నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. కొత్త ఓటరు నమోదుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు అవకాశం ఇచ్చినందున అర్హత గల యువత ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. ప్రతీపౌరుడు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ, ఆర్ఐలు మహేందర్‌రెడ్డి, స్పందన, అయ్యపరెడ్డి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

● మునుగోడు మండల పరిధిలోని నూతనంగా ఏర్పాటు చేసిన బీరెల్లిగూడం, కాశవారిగూడెం, రామకృష్ణాపురం నూతన పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లకు కనీస వసతులను, సౌకర్యాలను అందజేయాలని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ నరేందర్, ఆర్ఐ నాగరాజు ఉన్నారు.

ఎంపీవోపై దాడికి నిరసన

● నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది


డిండిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

డిండి, మార్చి 18: నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం ఎంపీవోపై జరిగిన దాడిని నిరసిస్తూ డిండి ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీవో డానియెల్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న పంచాయతీరాజ్ సిబ్బందిపై ఎంపీపీ దాడి చేయడం సరైనది కాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిరసన తెలిపిన వారిలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

విద్య, వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 18: ఉచిత విద్య, వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ డబ్బీకార్ మల్లేష్, సోషల్ వర్కర్ డాక్టర్ రాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని బకాల్‌వాడీ ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రశ్నపత్రాలను టూటౌన్ ఎస్ఐ కృష్ణయ్యతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, శ్రీను, సైదానాయక్, శ్రీనివాసరాజు, జగన్, వదూద్, సుమన్ తదితరులు పాలొన్నారు.

● జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో నరాల బలహీనతతో బాధపడుతున్న రోగులకు వైద్యపరీక్షలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గోపాలం శివన్నారాయణ, అక్కయ్య, రమణారెడ్డి, శోభ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుడికి ఓయూ డాక్టరేట్


నరసింహ

మాడ్గులపల్లి, మార్చి 18: మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, మాడ్గులపల్లి గ్రామానికి చెందిన మాడుగుల నరసింహకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. సీఎ స్ఐఆర్ ఫెలోషిప్ సాధించి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాద్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటనర్సయ్య పర్యవేక్షణలో 'స్టీరియో సెలక్టివ్ సింథసిస్ ఆఫ్ లింగ్నిక్ ఆసిడ్ డెరివేటీవ్స్ సినికాల్ సెట్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ సింథటిక్ మెథడాలజీస్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయన సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన అధికారులు నరసింహకు పీహెచ్‌డీ పట్టా అందజేసినట్లు తెలిపారు. నరసింహకు డాక్టరేట్ రావడంపై బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, ఐఆర్ఎస్ అధికారి కె.నాగరాజులతో పాటు కుటుంబసభ్యులు, గ్రామస్థులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ తన తల్లిదండ్రులు, విద్య నేర్పిన గురువులు, నాకు ఎల్లవేళలా అండగా నిలిచిన స్నేహితులకు, గ్రామస్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి చర్యలు


ట్రస్మా నూతన పట్టణ కమిటీతో రాష్ట్ర నాయకులు

మిర్యాలగూడ టౌన్, మార్చి 18: ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహన్, రవీందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ట్రస్మా ఫేస్-1 పట్టణ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీపతి శ్రీనివాస్, ఎస్.సోమయ్య, కోశాధికారిగా పి. రాజు, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ బచ్చు హరినాథ్, మహిళా ప్రతినిధి చంద్రకళ, సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీకి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి అమరేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజన్, నాయకులు రవీందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు.

ఏబీసీడబ్ల్యూవో కృష్ణవేణిని సస్పెండ్ చేయాలి

● వర్కర్ల నియామకంలో అవినీతిపై విచారణ జరిపించాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్


బీసీ బాలికల హస్టల్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న యువతులు

మిర్యాలగూడ, మార్చి 18: వెనకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్స్ వర్కర్ల నియామకాల్లో జరిగిన అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో వర్కర్ల సమస్యపై ఎస్ఎఫ్ఐ పలుమార్లు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వర్కర్ల నియామకానికి అధికారులు ఇచ్చిన వెసులుబాటును దుర్వినియోగం చేస్తూ నిరుపేదలైన పార్ట్‌టైం వర్కర్ల నుంచి ఏబీసీడబ్ల్యూవో కృష్ణవేణి లక్షలాది రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. ఒక్కరి నుంచి కృష్ణవేణి రూ.50వేలు లంచంగా తీసుకోగా ఏజేన్సీ గోపాల్‌రెడ్డి రూ.5వేల చొప్పు తీసుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆ కారపు నరేష్, డివిజన్ కార్యదర్శి కుర్ర సైదానాయక్, రమేష్, ప్రసన్న, రవి, అశోక్, వీరన్న కవిత, కళ్యాణి, భూమిక, సానియా, అనిత తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయలకులు

చిట్యాల, మార్చి 18: నీరు లేక పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బొంతల చంద్రారెడ్డి, బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. కరువు వల్ల భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండిపో యి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు జిట్ట సరోజ, ఐతరాజు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

మాడ్గులపల్లి: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్ లెంకల కల్పన, గ్రామ కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. మండలంలోని కల్వలపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. చిరుధాన్యాల్లో ఐరన్, ఫైబర్ పోషకాలు ఎక్కువగా కలిగి ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను తీసుకోని రక్తహీనత నుంచి బయటపడాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

డిండి: డిండి మండల కేంద్రానికి చెందిన తవిటి కృష్ణమ్మ (60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన యువకులు మృతురాలి కుటుంబసభ్యులు శ్రీశైలానికి రూ.10వేల నగదు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ యువకులు కుల, మతాలకతీతంగా మరణించిన కుటుంబ సభ్యునికి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో శైలేజ్, బాదమోని శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, పున్న దినేష్ ఉన్నారు.

కట్టంగూరు: కట్టంగూరుకు చెందిన డీసీఎం డ్రైవర్ చెరుకు శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కట్టంగూరుకు చెందిన తోటి డ్రైవర్లు తమవంతు సహాయంగా మృతుని కుటుంబ సభ్యులకు సోమవారం రూ.22 వేలను అందజేశారు. అర్థిక సహాయం అందజేసిన వారిలో ఓరుగంటి హరిబాబు, చెరుకు సైదులు, చెరుకు కాశీనాథ్, శివ, నగేష్, వెంకన్న, మల్లికార్జున్, కృష్ణ, అంజి, లింగస్వామి, కృష్ణ, రవి, రమేష్, రాజు పాల్గొన్నారు.

హాలియా: పిల్లలకు సమతుల ఆహారం అందజేయడం వల్ల పోషణస్థితి మెరుగవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. అనుముల, హాలియా సెక్టార్ పరిధిలోని పేరూరు, పంగవానికుంట, పంగవానికుంటతండా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నిర్వహించి పోషణ స్థాయిని మెరుగపరచడానికి తల్లులకు అవగాహన కల్పించారు. అన్ని రకాల చిరు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయాలు, పండ్లు, పిండి పదార్థాలు, మాంసకృతులు, ఎక్కువగా తీసుకోవాలని అలా తీసుకున్నప్పుడే పోషణస్థితి మెరుగుపడుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంతో పాటు ఆటపాటలతో విద్యను నేర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేసి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌మాస్టర్ వెంకట్‌రెడ్డి, టీచర్స్ అలివేలు, పంచాయతీ సెక్రటరీ సైదయ్య, అంగన్‌వాడీ టీచర్స్ వనజాకుమారి, సోనీ, సునీత, మంగమ్మ, నాగజ్యోతి, గోవిందమ్మ, ఆశా వెంకటమ్మ, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

కనగల్: మండల కేంద్రంలోని కనగల్ ఎక్స్‌రోడ్డులో గల శ్రీభూనీల సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ ధర్మకర్తగా బుసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చైర్మన్‌గా చిట్ల లింగయ్యగౌడ్ మరో 1 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

కొండమల్లేపల్లి: ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొండమల్లేపల్లి పోలీసులు పట్టణంలోని బస్టాండు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాంమ్మూర్తి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని అన్నారు. తనిఖీల్లో సిబ్బంది వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మండలంలోని శివన్నగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సామాజిక కార్యకర్త రాపోలు యాదగిరి మరమ్మతు చేయించారు. అధ్వానంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోనే చిన్నారులు విద్యాబోధనలు చేస్తున్నారు. ఆ భవనానికి తరచూ పాములు, కుక్కలు, తేళ్లు రావడంతో స్పందించిన సామాజిక కార్యకర్త అయిన యాదగిరి రూ.1లక్షతో అంగన్‌వాడీ భవనానికి తలుపులు, కిటికీలు, ఇతర సామగ్రి, ఇతర నిర్మాణ పనులతో పాటు మరమ్మతులు చేయించారు. సామాజిక సేవ చేస్తున్న రాపోలు యాదగిరిని గ్రామస్థులు అభినందించారు.

శాలిగౌరారం: శాలిగౌరారం నూతన ఎస్ఐగా నియమితులైన విప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన నల్లగొండ సీసీఎస్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ 40 రోజులు పాటు ఎస్ఐగా పనిచేసిన ఎం.ఐలయ్య నల్లగొండ సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

తిప్పర్తి: తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం జరిగే రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో రైతులు పాల్గొనాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి సన్నిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి 11.30 గంటలకు వరకు వ్యవసాయశాఖ పరిశోధకులు, శాస్త్రవేత్తలతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. నల్లగొండ నియోజకవర్గం తరుపున జరుగుతున్న కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని మీకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.


అవురవాణిలో ట్యాంకర్ల ద్వారా నీ టిని పొలానికి నీళ్లు పోయిస్తున్న రైతులు - నార్కట్‌పల్లి

● అడుగంటిన భూగర్భజలాలు, కరెంటు కోతల ప్రభావంతో బోర్లు ఎండిపోయి వరి పైర్లకు తగినంత నీరు అందడం లేదు. దీంతో చేతి కందే దశ కొచ్చే వరిపైరు ఎర్రబారింది. పంటలను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా చేసేది లేక ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావి నుండి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పొలాలకు నీరందిస్తున్న దుస్థితి దాపురించింది.